హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

కామారెడ్డి, అక్టోబర్ 21 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బీబీపేట్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్లు, సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికే రెండు సార్లు వినతిపత్రం అందజేసినా నామమాత్రంగా సందర్శించారే తప్ప చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆమరణ దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు రాజు, దేవరాజు, మొగులయ్య, రాములు, సాయిలు, శ్రీను, దిలీప్, స్వామి, పాల్, కరుణ, లావణ్య, రోజా, సోని, రేఖ, పద్మ, సుజాత పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బేడ బుడగ జంగం, దళిత సంఘాల నాయకులు

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 21 : ఎస్సీ వర్గీకరణ జరిగితే బుడగ జంగం కులస్తులకు ఎనిమిది శాతం రిజర్వేషన్ ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు కోరారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి బేడ బుడగ జంగం కులస్తులకు ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వాలని సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తం కుమార్ రెడ్డి అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ కోసం సబ్ కమిటీ వేసినందున బేడ బుడగ జంగం కులస్తులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బేడ బుడగ జంగం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య, నాయకులు లాలు, దుర్గాప్రసాద్, దేవదాసు, పెద్ద కాశయ్య, రాములు, సాయిబాబా, సిద్ధప్ప, సంతోష్ పాల్గొన్నారు.

బీర్కూర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నస్రుల్లాబాద్, అక్టోబర్ 21 : బీర్కూర్‌లో ఎస్సై రాజశేఖర్ సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు పాటించని 50 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 56 ఫిర్యాదులు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 21 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవె న్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 56 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజంపేటలో రెండు ఫిర్యాదులు

రాజంపేట్, అక్టోబర్ 21 : రాజంపేటలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదు వచ్చాయని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు కంట్రోల్ రూమ్ నంబర్ 08468-220051కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, సహాయ పౌరసరఫరాల అధికారి నరసింహారావు, జిల్లా సహకార అధికారి రాంమోహన్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో హిందూ సంఘ నాయకుల ధర్నా

భిక్కనూరు, అక్టోబర్ 21 : భిక్కనూరులోని చౌరస్తాలో బజరంగ్‌దళ్, హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా హిందూ సంఘ ప్రతి నిధులు మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలోని విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. శాంతియుతంగా నిరసన చేపట్టిన వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో హిందూసంఘ నాయకులు రమేశ్‌యాదవ్, నిఖిల్, యువకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

పాముకాటుతో వ్యక్తి మృతి

మాచారెడ్డి, అక్టోబర్ 21 : పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లాల రాములు(60) సాయంత్రం పని నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడని, కుడికాలుపై పాము కాటువేయడంతో పొలంలోనే మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి అల్లుడు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

భిక్కనూరు/మాచారెడ్డి, అక్టోబర్ 21 : భిక్కనూరులోని బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చందన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ తెలిపారు. వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు మహబూబ్ నగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆమెకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థిని చందనను అభినందించారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్ఆర్ టాలెంట్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న సన్నిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో రాందెడ్డి, పీఈటీ సునీల్‌రెడ్డి, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భిక్కనూరులో విద్యార్థిని చందనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాచారెడ్డిలో విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

మెడల్స్ సాధించిన క్రీడాకారులు

కామారెడ్డి, అక్టోబర్ 21 : ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన 35వ సౌత్‌జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2024లో జాతీయస్థాయి పోటీల్లో కామారెడ్డి జిల్లా అసోసియేషన్ క్రీడాకారులు మూడు మెడల్స్ సాధించారని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి అనిల్ కుమార్ సోమవారం తెలిపారు. ఈశ్వర్ 400 మీటర్లలో గోల్డ్ మెడల్, సెహ్వాగ్ 400 మీటర్‌లో సిల్వర్, ప్రవీణ్ సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. క్రీడాకారులను అభినందించారు.

మెడల్స్ సాధించిన జిల్లా క్రీడాకారులు

డయాలసిస్ పేషెంట్లకు పెన్షన్ ఇవ్వాలి

కామారెడ్డి, అక్టోబర్ 21 : తమకు పెన్షన్ ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట డయాలసిస్ బాధితులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధి రోగులకు ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్ కల్పించారని, తెలంగాణలో పెన్షన్ కల్పించాలని అన్నారు. కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతున్నామన్నారు. నెలకు రూ.పది వేలు వరకు ఖర్చు అవుతున్నదని అన్నారు. ఉద్యోగం లేక, ఉపాధి లేక ఇంటిల్లిపాది దవాఖానలకు తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పథకం అమలు చేసి, తమను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో డయాలసిస్ బాధితులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఒకేవైపు ఆరబెట్టుకోవాలి

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 21 : రైతులు ధాన్యాన్ని రోడ్డుపై ఒకవైపు మాత్రమే ఆరబెట్టుకోవాలని బాన్సువాడ డిపో మేనేజర్ సరితా దేవి అన్నారు. కొందరు రెండు వైపులా ఆరబెట్టడంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తడం తోపాటు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ధాన్యం వద్ద రాళ్లను అడ్డంగా పెట్టొద్దన్నారు. వాహనదారులు వాటిని గమనించక, రాత్రుల్లో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.

నేడు దివ్యాంగుల ఎంపిక

నస్రుల్లాబాద్, అక్టోబర్ 21 : మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయ ఆవరణలో ట్రై సైకిళ్లు, కృతిమ పాదాల పంపిణీకి దివ్యాంగుల ఎంపిక కోసం మంగళవారం శిబిరాన్ని ఏర్పాటు మంగళవారం చేయనున్నట్లు నెమ్లి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెమ్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల మోహన్‌రెడ్డి సహకారంతో నడవలేని వారికి ట్రై సైకిళ్లు, ప్రమాదవశాత్తు కాళ్లు కోల్పోయిన వారికి ఉచితంగా కృతిమ పాదాల పంపిణీకి ఎంపిక చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'వీసీల నియామకాల్లో లంబాడాలకు తీవ్ర అన్యాయం'

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 21 : వీసీల నియామకాల్లో లంబాడాలకు తీవ్ర అన్యాయం జరిగిందని లంబాడా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ నాయక్ సోమవాకరం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ వీసీల నినాయామకాల్లో అర్హత ఉన్న ప్రొఫెసర్లకు అన్యాయం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడానికి లంబాడాలు ఎంతో తోడ్పాటును అందించారని పేర్కొన్నారు. అలాంటి వారికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెగ్యులర్ వీసీల నియామకాల్లో స్థానం కల్పించకపోవడం దురదృష్టకరమని తెలిపారు.

నేడు బాన్సువాడ బంద్

బాన్సువాడటౌన్, అక్టోబర్ 21: హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం చేసినందుకు నిరసనగా మంగళవారం బాన్సువాడ బంద్‌కు స్థానిక హిందు సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందుకు హిందూ వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశాయి.

చెరుకు పంటను పరిశీలించిన రైతులు

జహీరాబాద్ శివారులో రైతులు సాగు చేస్తున్న చెరుకు పంటను పరిశీలిస్తున్న వెంకంపల్లి గ్రామ రైతులు

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 21: మండలంలోని వెంకంపల్లి గ్రామ రైతులు సోమవారం జహీరాబాద్ శివారులో నూతన పద్ధతులతో సాగు చేస్తున్న చెరుకు పంటను పరిశీలించారు. చెరుకు రకం సాగు విధానంపై రైతులతో మాట్లాడారు. ఎకరానికి 70 టన్నుల చెరుకు ఉత్పత్తి అవుతున్నట్లు చెప్పారు. అక్కడ సాగు చేస్తున్న చెరుకు రకాన్ని తమ మండలంలో సాగు చేయాలనే ఉద్దేశంతో..గాయత్రీ ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో సోమవారం సాగు చేస్తున్న చెరుకు పంటలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. రైతులు కరుణాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, విఠల్, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కిష్టారెడ్డి, మోహన్, రమేశ్, మల్లేశ్, నర్సింహ్మారెడ్డి, ఏసులు, గాయత్రీ ఫ్యాక్టరీ సిబ్బంది ఉన్నారు.

తేమశాతం లేకుండా చూసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 21: విక్రయించడానికి తెచ్చిన ధాన్యంలో తేమశాతం లేకుండా చూసుకోవాలని సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు అన్నారు. సోమవారం మండలంలోని సోమిర్యాగడి తండా గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున రైతులు టార్పాలిన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్‌గౌడ్, సొసైటీ సీఈవో విశ్వనాథం, డైరెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు ఉన్నారు.

'రైతు నేస్తం' సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, అక్టోబర్21: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్ కుమార్ కోరారు. రానున్న యాసంగిలో సాగు చేసే ఆరుతడి పంటల వివరాలు, విత్తనాల ఎంపిక, సస్యరక్షణ చర్యలు, చీడ పీడల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు ఇస్తారని, మండల రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, అక్టోబర్ 21 : నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ భాగం నుంచి 3200 క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటి నీటి విడుదలను దృష్టిలో ఉంచుకొని సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదిలారు. నదీ పరివాహక ప్రాంతంలోకి ఎవరూ వెళ్ల వద్దని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు.

ముగిసిన వైద్య శిబిరం

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 21 : బాన్సువాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆక్యుప్రెషర్, మార్నెటిక్, వైబ్రేషన్ చికిత్స శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు చికిత్స అందజేసిన ఆక్యుప్రెషర్ రీసెర్చ్, ట్రీట్‌మెంట్ సెంటర్ జోద్‌పూర్ ప్రతాప్ నగర్ డాక్టర్లు, నిర్వాహకులకు స్థానిక లయన్స్ క్లబ్ వారు అభినందనలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాన్సువాడ శాఖ అధ్యక్షుడు అంజిరెడ్డి, కోశాధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

ఎల్లారెడ్డిలో కొవ్వొత్తులతో పోలీసులు, విద్యార్థుల మానవహారం

తాడ్వాయిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నస్రుల్లాబాద్‌లోని పోలీసు స్టేషన్ వద్ద..

కామారెడ్డి/నస్రుల్లాబాద్/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/నాగిరెడ్డిపేట/బిచ్కుంద/లింగంపేట(తాడ్వాయి), అక్టోబర్ 21 : అక్టోబర్ 21 : పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థూపం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగనిరతి ఫలితమే నేడు కనిపిస్తున్న శాంతి, సౌభ్రాతృత్వమని, వారి త్యాగం మరువలేనిదని కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణతోపాటు దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీసు వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ.. సమాజంలో శాంతిస్థాపన కోసం అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరనీయమని అన్నారు. పోలీసుల అమరవీరుల స్మరిస్తూ పోలీసు వారి ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫొటో వీడియో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 40 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశా రు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ యాకూబ్‌రెడ్డి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జార్జ్ తిరుపయ్య, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్ కుమార్, సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఆర్ఐ నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, ఎస్సైలు, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్‌లోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అమరులైన పోలీసులకు సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో హైవే పెట్రోలింగ్ ఇన్‌చార్జి ఎస్సై మన్సూర్ ఖాన్, ఏఎస్సై వెంకట్రావ్, కానిస్టేబళ్లు బుజ్జి, హరిచంద్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై బొజ్జ మహేశ్ పోలీస్ అమరవీరుల చిహ్నానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్సై బొజ్జ మహేశ్ ఆయుధాల గురించి వివరించారు. పట్టణంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద నుంచి విద్యార్థులతో కలిసి సీఐ రవీందర్, ఎస్సై మహేశ్, పోలీసులు కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

లింగంపేటలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఎస్సై ప్రకాశ్ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు రాజయ్య, రాజేందర్, పోలీసు సిబ్బంది కిరణ్, శంకర్, సంపత్, భైరవప్రసాద్, రామాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో..

నాగిరెడ్డిపేటలోని సిద్ధార్థ కళాశాల విద్యార్థులకు ఎస్సై మల్లారెడ్డి 'పోలీస్ విధులు, బాధ్యతలు' అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఏఎస్సై ఉమేశ్, సిబ్బంది ఉన్నారు. బిచ్కుందలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై మోహన్‌రెడ్డి, ఏఎస్సై శంకర్, పాండు, రాము, అశోక్, నదీమ్, శేషు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. తాడ్వాయిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం రాత్రి పోలీసు సిబ్బంది, విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై మోహన్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 21 : నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన బోయిని మల్లేశంకు సెల్‌ఫోన్‌ను సోమవారం అందజేసినట్లు కానిస్టేబుల్ గంగారాం తెలిపారు. బోయిన మల్లేశం మూడు రోజుల క్రితం తన ఫోన్ వ్యవసాయ పనుల నుంచి వస్తుండగా పడిపోవడంతో.. స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐటీ ద్వారా టాస్క్‌టీమ్ ఆపరేటర్ శ్రీనివాస్ మొబైల్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశారు. ప్రజలు తమ మొబైల్‌ను పోగొట్టుకుంటే.. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

హస్గుల్ గ్రామ యువకులకు..

బిచ్కుంద , అక్టోబర్ 21 : మండలోని హస్గుల్ గ్రామానికి చెందిన మంద మహేశ్, పెద్ద తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన రాజు, మండల కేంద్రానికి చెందిన బెల్లుర్‌కర్ సంతోష్ కొన్ని రోజుల క్రితం బైక్‌పై వెళుతుండగా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టు కున్నామని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు చేశారు. బాధితులకు సోమవారం ఎస్సై మోహన్ రెడ్డి మొబైల్ ఫోన్లను అందజేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 21: నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు తమ విధుల్లో నిబద్ధత పాటించాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని మండల పరిషత్ కారాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మాణిక్యం, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

లింగంపేట బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

లింగంపేట, అక్టోబర్ 21: గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై ప్రకాశ్ ప్రజలకు సూచించారు. సోమవారం లింగంపేట బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు పట్టణ ప్రాంత ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలను మోసాలు చేస్తూ డబ్బులు కాజేస్తున్నట్లు వివరించారు. గతంలో లాటరీలు వచ్చాయని ఫోన్లు చేసి డబ్బులు దండుకునే వారని తెలిపారు. బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేసుకోవాలని బ్యాంకు అధికారుల పేరిట ఫోన్లు చేసి బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఖాళీ చేసేవారన్నారు. ప్రస్తుతం వారు చదువుకుంటున్న విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మీ పిల్లవాడు గంజాయి విక్రయిస్తూ పట్టుబడినట్లు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గంజాయి కేసులో అరెస్ట్ అయిన మీ బాబును విడిచిపెట్టడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్లకు స్పందించవద్దని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు

విద్యార్థులకు బ్యాగుల వితరణ

గాంధారి, అక్టోబర్ 21: మండల కేంద్రంలోని దుర్గానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం, ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ బ్యాగులను అందజేశారు. అంతకు ముందు ఆయన మండల కేంద్రంలో ముత్తూట్ ఫైనాన్స్ మినీ బ్రాంచిని రీజినల్ మేనేజర్ రాజు ముప్పాలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించిన సిబ్బంది

విద్యుత్‌లైనుకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

గాంధారి, అక్టోబర్ 21: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి గాంధారి నుంచి ఉత్తునూర్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్‌లో సమస్య రావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తిప్పారం గ్రామశివారులోని పంటపొలాల్లో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ స